





# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

బుధవారం 08-07-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్


అధికారుల అంతర్గత మానం..

# ప్రభుత్వ నిధుల్లో మోసం!?




**అక్రమాల ఆరోపణలు.. ప్రజాధనం దుర్వినియోగంపై విచారణకు డిమాండ్**

**గాడి తప్పుతున్న గ్రామాభివృద్ధి.. దారిలో పెట్టాలి జిల్లా అధికారులు**

**సోషల్ ఆడిట్‌తో చిట్టా బహిర్గతం.. ప్రజల ముందు అభివృద్ధి లెక్కలు**




నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):

జిల్లాలోని మర్రిగూడ మండలంలో 2024 ఏప్రిల్ 1 నుండి 2025 డిసెంబర్ 31 వరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో భారీ స్థాయిలో అక్రమాలు, గోల్‌మాల్ జరిగాయని ఆరోపణలు మండల వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి.

మర్రిగూడ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద చేపట్టిన, ప్రతి పనికి సంబంధించిన రికార్డులను ఉన్నత అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామసభ ఆమోదం, పంచాయతీ తీర్మానాలు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అనుమతులు, అంచనాలు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, ఎంబీ రికార్డులు, ఓచర్లు, కాంట్రాక్టర్ల పేర్లు, బ్యాంక్ ఖాతా వివరాలు, లెడ్జర్లు, నోట్ ఫైళ్లు సహా సంబంధిత అన్ని పత్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యతను నిర్ధారించాలని మండల ప్రజలు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

మిగతా 2లో

### ప్రధాన ఆరోపణలు

- జరగని పనులకు బిల్లులు డ్రా చేయడం
- ఫేక్ బిల్లులు, వోచర్లు
- ప్రభుత్వ ధనాన్ని అక్రమంగా దుర్వినియోగం
- పారదర్శకత, జవాబుదారీతనం
- ప్రజాప్రతినిధుల, గ్రామస్థుల ఆందోళన

### ప్రజల డిమాండ్లు

- జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓ, డీపీవో ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సమగ్ర విచారణ
- సోషల్ ఆడిట్ నిర్వహించి పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలి
- అక్రమాలు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### ప్రజాధనం... ప్రజలకే!

ప్రతి రూపాయి లెక్క చెప్పాలి...

ప్రతి పని ప్రజల ముందు ఉంచాలి...

పారదర్శకతే అభివృద్ధికి పునాది

# 38 వేల కోట్ల ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు

- బిఆర్ఎస్ హయాంలో భారీ అవినీతి.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల దోపిడీ - ఆయకట్టు పెరగకుండానే 1.81 లక్ష కోట్లు వృథా
- ప్రజాధనం దుర్వినియోగంపై విచారణకు డిమాండ్ - బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

2లో



# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్ల ఆరోపణలు

- డెలివరీ పేషెంట్ నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేశారన్న ఆరోపణ
- ఆసుపత్రిలో అపరిశుభ్రతపై ఆందోళన
- బాత్రూముల్లో దుర్వాసనతో రోగులకు ఇబ్బందులు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పేదలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలి
- సూపరింటెండెంట్‌కు సమస్యలు వివరించిన నాయకులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవినీతికి తావు ఉండొద్దు
- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

4లో



# అధికారుల అంతర్గత మౌనం.. ప్రభుత్వ నిధుల్లో మోసం!?

(మొదటి పేజీ తరువాయి)

ఆయా పనులకు సంబంధం లేని సొంత కుటుంబ సభ్యుల పేరిట, వారి బంధువుల పేరిట ప్రజాధనం బదిలీ చేసి, గ్రామ పంచాయతీ నిధులను కొల్లగొట్టినట్లు స్థానికులు మండిపడుతున్నారు. కొన్ని లక్షల రూపాయల పనులు జరిగినట్లు ఫైళ్లలో పేర్కొన్నా, క్షేత్ర స్థాయిలో ఎలాంటి పనులు జరగలేదనే ప్రచారం జోరుగా సాగుతుంది.!?కాగితాలపై మాత్రం పనులు పూర్తయినట్లు చూపి, బిల్లుల రూపంలో ప్రభుత్వ ధనాన్ని ఆక్రమించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా జరిగిన పనులకు కూడా అసలు ఖర్చు కంటే, నాలుగు రెట్లు అధికంగా బిల్లులు తీసి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. ఇందులో భాగంగా ఫేక్ బిల్లులు, ఫేక్ వోచర్ల తయారీ, తప్పుడు పత్రాలను సమర్పించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అందుకే లోపాలు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో ఉన్నాయని, కొన్ని లక్షల రూపాయలు, అక్రమాలు జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.




### పారదర్శకత లోపం.. జవాబుదారీతనం ప్రశ్నార్థకం


15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పూర్తిగా లోపించాయని ఫిర్యాదుదారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎప్పటి నుంచో జరుగుతున్న కార్యమని, వ్యవస్థలోని లోపాల కారణంగా ప్రజాధనాన్ని కాపాడేందుకు తాము ఈ ఫిర్యాదు చేస్తున్నామని పిర్యాదుదారు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు గ్రామాల అభివృద్ధికి ఎంతో కీలకమైనవి, దీనిపై ప్రజల్లో పూర్తి నమ్మకం కలిగించేందుకు, అధికార యంత్రాంగం చొరవ చూపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అదే తరహా అక్రమాలు పునరావృతం కాకుండా ఉండాలంటే, అధికారులు అలెర్ట్ గా ఉండాలని, ఇదంతా జరుగుతుండగా వారు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతి పనికి గ్రామసభ ఆమోదం తెలిపిన పంచాయతీ తీర్మానాలు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అనుమతులు, అంచనాలు, వర్క్ ఆర్డర్లు, ఫేక్ స్థాయి కొలతలు అమోదు చేసిన ఎంబీ రికార్డులు, ఓచర్లు, బిల్లులు, పనులు పూర్తయినట్లు ధృవీకరణ పత్రాలు, కాంట్రాక్టర్ పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, లెడ్జర్లు, నోట్ ఫైళ్లను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి నాణ్యతను నిర్ధారించాలని, ప్రజాధనం సక్రమంగా ఖర్చు అయిందో లేదో తేల్చాలని కూడా అనుభవజ్ఞులు కోరుతున్నారు.

### ప్రత్యేక కమిటీతో విచారణ, బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్

ఈ వ్యవహారంపై మండల అధికారుల విచారణ కాకుండా, జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓ, డీపీవో వంటి ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, 15వ ఆర్థిక సంఘం బడ్జెట్ పై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విచారణలో నిబంధనల ఉల్లంఘనలు, నిధుల దుర్వినియోగం, అవినీతి తేలితే బాధ్యులైన అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులపై కఠినమైన శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని మండల ప్రజలు పట్టుబడుతున్నారు. దుర్వినియోగమైన ప్రభుత్వ సొమ్మును బాధ్యుల నుండి రికవరీ చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి లెక్కలను బహిరంగపరచాలని, సామాజిక తనిఖీ నిర్వహించి ఖర్చుల వివరాలను బహిర్గతం చెయ్యాలని, ప్రజా వేదికల ద్వారా మండలంలో ప్రజలకు వివరించాలని మండల ప్రజానీకం కోరుతున్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన వారిపై, ఉక్కుపాదం మోపితేనే మళ్లీ ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా ఉంటాయని ప్రజల అభిప్రాయం. ఈ ఫిర్యాదుపై సకాలంలో స్పందించి, విచారణ పూర్తి చేసి నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత, జిల్లా యంత్రాంగంపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ప్రజల విశ్వాసం పునరుద్ధరణకు తక్షణ చర్యలు అవసరం

మర్రిగూడ మండలంలో వెలుగులోకి వచ్చిన ఈ ఆరోపణలు, గ్రామీణాభివృద్ధి పథకాలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాల కోసం ఉద్దేశించినవి. అలాంటి నిధుల్లోనే ఇంత పెద్ద ఎత్తున, అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తే ప్రజలు ఎవరిని నమ్మాలి అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం రాష్ట్ర స్థాయిలో చర్చకు రావడంతో, ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం ప్రతి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి, చేసిన పనులు, ఖర్చుల లెక్కలను ప్రజల ముందు ఉంచాల్సి ఉండగా, అలా జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. 01 ఏప్రిల్ 2024 నుండి 31 డిసెంబర్ 2025 వరకు జరిగిన, ప్రతి పనికి సంబంధించిన అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని, విచారణలో తప్పు చేసినట్లు తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన శాఖాపరమైన చర్యలతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అంటున్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం అయినట్లు తేలితే, ఆ మొత్తాన్ని సంబంధిత వ్యక్తుల నుండి రికవరీ చేయాలని, మొత్తంగా చూస్తే ప్రజాధనం పరిరక్షణకు, వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించేందుకు, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తక్షణమే ప్రత్యేక విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉందని అనేకులు అభిప్రాయపడుతున్నారు.






## 38 వేల కోట్ల ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టుకు, లక్ష కోట్లకు పైగా ఖర్చు చేశారని, ప్రజాధనం దుర్వినియోగమైందని ఆరోపించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పేరుతో, జరిగిన అవినీతిని ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. అసలు ప్రణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునఃరూపకల్పన చేసి, కాళేశ్వరంగా మార్చడం ద్వారా ప్రాజెక్టు వ్యయం రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి, ఒక లక్ష కోట్లకు చేరుకుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు కాకుండా కెసిఆర్ కుటుంబం, జేబులు నింపుకునేందుకే ఈ ప్రాజెక్టును నిర్మించారని విమర్శించారు. ఒక లక్ష 20 వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టుకు, జాతీయ హోదా ఎందుకు రాలేదో, ఆర్థికంగా సాధ్యం కాకపోయినా నిర్మాణానికి కేంద్రం ఎలా అనుమతించిందో బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంపై మాత్రమే కాకుండా, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల పేరుతో కూడా, భారీగా ఖర్చు చేసిందని తెలిపారు. మొత్తంగా ఒక లక్ష 81 వేల కోట్లు ఖర్చు చేసినా, ఎకరా కూడా కొత్త ఆయకట్టు పెరగలేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై 27 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుపై 9 వేల కోట్లు, కాళేశ్వరంపై దాదాపు లక్ష కోట్లు ఖర్చు చేశారని లెక్కలు వెల్లడించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూలిపోవడానికి కారణం తప్పుడు డిజైన్, తప్పుడు నిర్మాణం, నిర్వహణ లోపమేనని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసమే పనిచేసిందని, రైతులను మోసం చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని, కేవలం 2023 సెప్టెంబర్‌లో ఒక గంట మాత్రమే ఒక పంపు నడిపారని విమర్శించారు. ప్రాజెక్టు వ్యయం ప్రారంభంలో 35 వేల కోట్లుగా ఉన్నా, డిపిఆర్ సమర్పించే సమయానికి, 55 వేల కోట్లకు పెరిగిందని, భూసేకరణ కలుపుకుంటే 70 వేల కోట్లు దాటుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను కనీస పెట్టుబడితో పూర్తి చేసి, ఆయకట్టు పెంచేందుకు కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టును 2027 డిసెంబర్ 31లోగా పూర్తి చేసేందుకు 18,400 కోట్లతో పనులు ముమ్మరం చేస్తున్నామని, పాలమూరు-రంగారెడ్డిని 30 నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. మొత్తంగా బిఆర్ఎస్ హయాంలో ఒక లక్ష 80 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు కూడా కొత్త నీళ్లు ఇవ్వలేదని, అన్నీ గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే సాగు కొనసాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజాధనం దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## టియుడబ్ల్యూజె జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

**జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జర్నలిస్టులకు పిలుపు**

**పటాన్‌చెరు, క్రైమ్ ప్రతినిధి జూలై 07:** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) సంగారెడ్డి జిల్లా మహాసభ ఈ నెల 9న సంగారెడ్డి పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో జరగనున్న నేపథ్యంలో, మహాసభ పోస్టర్‌ను పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రుమాండ్ల అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్వ శ్రీనాథ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే టీయూడబ్ల్యూజే ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా మహాసభలో కొత్త జిల్లా కమిటీలను నియమించడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కీలక తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేలా సమష్టిగా కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ తొలిసారిగా సంగారెడ్డి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని మీడియా సంస్థల్లో పనిచేస్తున్న పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరై జిల్లా మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నర్రా రామారావు, సయ్యద్ సులేమాన్, కాశీపతి, పత్తి నరసింహ, ఏబీఎన్ యాదగిరి, బసవేశ్వర్, బాలు, శ్రీనివాసరెడ్డి, బీసీఎన్ శ్రీనివాస్, మాజీద్ అలీ, మడపటి శేఖర్, వివేక్, కోటేష్, శివాజీ, ప్రభాకర్ యాదవ్, సిద్దు, రాము, సంజీవ, రాజు, సలీం, విజయ్ కుమార్, బండి పురుషోత్తం, శంకర్, దశరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లందేవిచెరువు గ్రామ పంచాయతీ ప్రతి అర్హుడైన, పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

**సంస్థాన్ నారాయణపురం, జూలై 07(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం, అల్లందేవిచెరువు గ్రామంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ఓటర్ల వివరాల ధృవీకరణ, మార్పులు, చేర్పులు, సంబంధిత ఫారాల స్వీకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, చిరునామా మార్పు, వివరాల సవరణ లేదా తొలగింపు అవసరమైతే నిర్ణీత ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం ప్రజలు బిఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామ ప్రజలు సంబంధిత అధికారులు, బూత్‌లెవల్ ఆఫీసర్లు మరియు సిబ్బంది, పాల్గొన్నారు.



# ప్రజా ఆరోగ్యమే మా ప్రథమ ప్రాధాన్యత

**ఉచిత వైద్య శిబిరంతో యరుగండ్లపల్లి సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ఆదర్శం**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అవిరామంగా పని చేస్తున్న యరుగండ్లపల్లి సర్పంచ్, వల్లంల సంతోష్ యాదవ్ సేవలను మర్రిగూడ మండలం ప్రజలు కొనియాడుతున్నారు. నేటి రోజుల్లో ప్రజా ప్రతినిధులు అంటే కేవలం పదవులు అలంకరించే వారు కాదు, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచి, వారి అవసరాలు తీర్చే నిజమైన సేవకులు అని నిరూపిస్తున్న కొద్దిమంది నాయకుల్లో, సంతోష్ యాదవ్ మొదటి వారని చెప్పుకోవచ్చు. తాను పుట్టి పెరిగిన మట్టి రుణం తీర్చుకోవాలనే, గొప్ప ఆశయంతో సర్పంచ్ సంతోష్ యాదవ్ తన స్వగ్రామం యరుగండ్లపల్లి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో చాలా మంది పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల కారణంగా, సరైన వైద్యం చేయించుకోలేకపోతున్నారనే విషయాన్ని గుర్తించిన ఆయన, వెంటనే స్పందించి కామినేని ఆసుపత్రి వైద్యుల సహకారంతో, గ్రామంలో భారీ ఎత్తున ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో వందలాది మంది గ్రామస్తులు పాల్గొని రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయించుకున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు ప్రతి ఒక్కరిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, మెరుగైన వైద్య సలహాలు కూడా అందించారు. వైద్య శిబిరం ఏర్పాటుకు సర్పంచ్ సంతోష్ యాదవ్ వ్యక్తిగతంగా పర్యవేక్షించి, ప్రతి ఏర్పాటును చూసుకున్నారు. సర్పంచ్ వల్లంల చొరవను చూసిన మర్రిగూడ మండల ప్రజలు ఆయనను అభినందిస్తూ, "పదవి కోసం కాకుండా ప్రజల కోసం పని చేసే నాయకుడు మాకు దొరకడం మా అదృష్టమని ప్రశంసించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు గ్రామస్తులు సంతోష్ యాదవ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఆయన చూపుతున్న చిత్తశుద్ధి, చొరవ ఇతర ప్రజా ప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. పదవి లేని సమయంలోనే ఇలాంటి ఎన్నో సేవలు చేసిన ఆయన, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలతో ప్రజలకు సేవ చేస్తారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య, విద్యా, మౌలిక సదుపాయాలు అందిస్తానని సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి





**ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**డీఎంహెచ్‌వో డా. నరేందర్ రాథోడ్ ఆదేశం**

**మంచిర్యాల, జూలై 7 (క్రైమ్ మిర్రర్):** వర్షాకాలంలో సీజనల్, కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. లక్సెట్టిపేట రైతు వేదికలో మంగళవారం జన్నారం, దండేపల్లి, తాళ్లపేట, వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యులు, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త వద్ద అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి దోమల పెరుగుదలను అరికట్టాలని కోరారు. టైఫాయిడ్, అతిసారం వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, సురక్షితమైన తాగునీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆర్‌బీఎస్‌కే బృందాలు నిరంతరం పాఠశాలలను సందర్శించాలని సూచించారు. మాతా--శిశు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటూ, లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలకు ప్రోత్సహించాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు సకాలంలో నిర్వహించి, 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని, స్కానింగ్ కోసం ముందస్తు ప్రణాళిక రూపొందించాలని వైద్యులను ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది మధ్య సమన్వయం కోసం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా గ్రామాల్లో పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రాల ద్వారా ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అనుమానితులను గుర్తించి వెంటనే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందించడంతో పాటు ఐసీడీఎస్, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మున్సిపల్, విద్యాశాఖ సిబ్బంది, మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుంటూ మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. ప్రతి నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ప్రగతి సమీక్షలు నిర్వహిస్తామని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం అధికారులు డా. సుధాకర్ నాయక్, డా. అరుణశ్రీ, డా. సమత, లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఎండీ రషీద్, అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వోలు, టీపీహెచ్ఎన్‌లు, క్షయవ్యాధి, హెచ్ఐవీ-ఎయిడ్స్ విభాగాల సిబ్బంది, దిశా సిబ్బంది, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా ఆరోగ్య కార్యకర్తలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్ల ఆరోపణలు

- డెలివరీ పేషెంట్ నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేశారన్న ఆరోపణ
- ఆసుపత్రిలో అపరిశుభ్రతపై ఆందోళన
- బాత్రూముల్లో దుర్వాసనతో రోగులకు ఇబ్బందులు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పేదలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలి
- సూపరింటెండెంట్‌కు సమస్యలు వివరించిన నాయకులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవినీతికి తావు ఉండొద్దు
- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 07:** సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు, అపరిశుభ్రత నెలకొన్నాయని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మంగళవారం ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ మాట్లాడుతూ.. ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఓ మహిళ నుంచి ఆసుపత్రి సిబ్బంది రూ.2,000 నుంచి రూ.3,000 వరకు అక్రమంగా వసూలు చేసినట్లు బాధితురాలు తమకు తెలిపిందన్నారు. పేదలకు ఉచితంగా అందాల్సిన వైద్య సేవల కోసం డబ్బులు వసూలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, వైద్య సేవల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించబోమని పార్టీ నాయకులు హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కోరారు. ఆసుపత్రిలోని బాత్రూములు అపరిశుభ్రంగా ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, దీంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిశుభ్రత నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నవాజ్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షుడు రవి, నాయకులు సుధాకర్, నరేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు. అక్రమ వసూళ్ల అంశం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు చేసిన ఆరోపణల ఆధారంగా వెల్లడైంది. దీనిపై సంబంధిత ఆసుపత్రి యాజమాన్యం లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందన అందాల్సి ఉంది.

# ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

- సామాజిక ఉద్యమాలకు నిలయం ఎమ్మార్పియస్ - మాదిగ దండోరా
- సమాజంలో రుగ్మతలపై అలుపెరుగనిపోరాటం చేస్తున్న ఉద్యమ నేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ
- ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ





**ఆత్మకూరు(ఎం),జూలై07/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరణ చేయడం జరిగింది.పండ్లు,మిఠాయిలు పంచడం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో 32 సంవత్సరాలు ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని తెలుగు నేల మీద ఈదుముడిలో పుట్టింది. మాదిగ దండోరా ఉద్యమం దేశంలో నూతన సామాజిక విప్లవాన్ని సృష్టించింది.32 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసాన్ని ఆధార అభిమానాలను పొంది సుదీర్ఘకాలంగా నిలబడిన రాజకీయేతర ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ ఉద్యమం అందరికన్నా అట్టడుగున ఉన్నవారికి న్యాయం చేకూరినప్పుడే రాజ్యాంగానికి ఒక అర్థం ఉంటుందనే డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ స్ఫూర్తితో భారత దేశంలో మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఉద్భవించిన మహా ఉద్యమం మాదిగ దండోరా ఉద్యమం సామాజిక అస్తిత్వ ఉద్యమాల్లో దండోరా ఉద్యమం చారిత్రకమైనదని మాదిగ మరియు ఉపకులాల్లో ఆత్మస్థైర్యం నింపి ఆత్మగౌరవానికి నాంది పలికిందని మాదిగ మాదిగ ఉపకులాలే కాకుండా దోపిడీకి అణచివేతకు గురైన కులాల్లో కూడా పోరాట స్ఫూర్తిని నింపిన ఉద్యమం మాదిగ దండోరా ఉద్యమమని అన్నారు.ఎక్కడైతే మాదిగలు అవమానించబడ్డారో, ఎక్కడైతే నిందించబడ్డారో ఎక్కడైతే ఆత్మగౌరవం కోల్పోయారో కోల్పోయిన చోటనే తిరిగి మంద కృష్ణ మాదిగ ఆత్మగౌరవాన్ని హక్కుల్ని మాదిగ జాతికి తలెత్తుకునే విధంగా భారతదేశంలో ఉద్యమాలు నడిపిన నేత మంద కృష్ణ మాదిగ అని అన్నారు. మానవత దృక్పథంతో మానవత వాదిగా నడిపిన ఎమ్మార్పీఎస్ ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుర్తించి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం మంద కృష్ణ మాదిగ పొందడం మాదిగ జాతికి దక్కిన గొప్ప అరుదైన పద్మశ్రీ పురస్కారం అని ఎస్సీ వర్గీకరణ సాధించి వెయ్యి యేండ్ల బంగారు భవిష్యత్తు మాదిగ జాతికి అందించిన మహోన్నత నేత మందకృష్ణమాదిగ అని అన్నారు. సామాజిక న్యాయమే మా గమ్యస్థానం రాజ్యాధికారం సాధించడమే అంతిమ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,మండల ఇంచార్జీ మందుల లింగ స్వామి మాదిగ,గట్టు రాములు మాదిగ, గట్టు జ్ఞానేశ్వర్ మాదిగ,గురుకు యాదగిరి మాదిగ,ఇంజమూరి నర్సింహ్మా మాదిగ,మంద చంద్రయ్య మాదిగ,గట్టు శరత్ మాదిగ,కనుకుంట్ల మహేష్ మాదిగ,మామిడి అనిల్ మాదిగ, శిగ మల్లేష్ గౌడ్,గడ్డమీది వెంకటేష్ గౌడ్,మందుల శ్రీధర్, మాస్,ఎలాగందుల స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీ కల్వకుర్తి పాఠశాలను సందర్శించిన డీఈఓ రమేష్ కుమార్

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ మంగళవారం కల్వకుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహారం అందించాలన్నారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని ఆదేశించారు. అనంతరం పాఠశాల నిర్వహణ, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హాస్టల్ నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల విద్యాధికారి శంకర్ నాయక్, పాఠశాల ప్రత్యేక అధికారిని రమాదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి శ్రీకారం

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం నర్సంపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ ప్రారంభ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గణపతి పూజ, అంకురారోహణం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం ప్రారంభ దశలోనే సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ.1 లక్షల విరాళాన్ని అందించి నిర్మాణ అభివృద్ధి పనులకు తోడ్పాటు అందించారని గుర్తుచేశారు. ఆయన చేసిన సహాయానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సంపల్లి సర్పంచ్ పులిమామిడి శైలజ శ్రీశైలం, వీరెడ్డి వెంకట్ రెడ్డి, వాస కృష్ణయ్య, అనంత రెడ్డి, కృష్ణయ్య, పవన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.





# పల్లెర్ల చేనేత సహకార సంఘం పాలకవర్గం ఏకగ్రీవం

**ఆత్మకూరు(ఎం),జూలై07/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామ చేనేత సహకార సంఘం పాలక వర్గాన్ని చేనేత సహకార సంఘ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 9 మంది డైరెక్టర్ల అభ్యర్థులకు ఎన్నికల అధికారి శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేశారు . అనంతరం నూతన పాలక వర్గ సభ్యులు ఆఫీస్ బేరర్లని ఎన్నుకున్నారు. పల్లెర్ల చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా పొడుగు వెంకటేశం, ఉపాధ్యక్షులుగా కందగట్ల వెంకటేశం, కార్యదర్శిగా గుర్రం శ్రీనివాస్, కోశాధికారిగా సాయిని పురుషోత్తం, డైరెక్టర్లుగా గుర్రం మల్లేషం,వట్నాల వెంకటేష్, జంజీరాల సోమయ్య, ఏలూరి ధనలక్ష్మీ వెంకటేశ్వర్లు, రాపోలు శ్వేత వెంకటేష్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చేనేత సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం మాట్లాడుతూ ప్రతి చేనేత కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో చేరేలా కృషి చేస్తానని అన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి పాలక వర్గ సభ్యుల సహకారంతో తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి శ్రీనివాస్, చేనేత సంఘం మాజీ అధ్యక్షులు ఏలూరి సుదర్శన్, మాజీ ఉపాధ్యక్షులు సాయిని అశోక్, మాజీ డైరెక్టర్లు గుర్రం వాసుదేవ్, రాపోలు స్వామి, ఏలే నిర్మల, గుర్రం నారాయణ, సాయిని వెంకటేష్, ఏలే విశ్వనాథం, కందగట్ల వెంకయ్య, ఏలూరి వెంకటేశ్వర్లు, గుర్రం సంతోష్, వట్నాల లింగస్వామి, రాపోలు వెంకటేష్, గుర్రం భిక్షపతి, గుర్రం చైతన్య, పొడుగు ముఖేష్ , పొడుగు మోహన్,తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు....



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం లో ని ఖాజాగూడా లో అధ్యక్షులు మాస్కురి రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు జెండా ఆవిష్కరించి, ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మస్కూరి రాజేష్ మాదిగ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమాన హక్కులు, ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఉద్యమ ఆశయాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గణేష్, కన్వీనర్లు ప్రేమ్, నరేష్, రాజు, శ్రీనివాస్ పింటూ సుధాకర్, గ్రామవాసుల తదితరులు పాల్గొని ఎమ్మార్పీఎస్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ఉద్యమ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న “ జిల్లా సదస్సు “ ను జయప్రదం చేయండి

### సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు



**భువనగిరి, జూలై 07(క్రైమ్ మిర్రర్):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక , వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 12వ తేదీన సుందరయ్య భవన్, భువనగిరిలో నిర్వహిస్తున్న “ జిల్లా సదస్సు “ లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ్మ పిలుపు నిచ్చారు. మంగళవారం సుందరయ్య భవన్, భువనగిరిలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు కొమటిరెడ్డి చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జల్లెల పెంటయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ 12 సంవత్సరాల కాలంలో అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లలు తెచ్చి హక్కులను హరించిందని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగా ఉపయోగపడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి జిరాంజీ చట్టం తెచ్చి గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా చేస్తున్నదని విమర్శించారు. మరోపక్క దేశానికి బువ్వ పెడుతున్న రైతులను హరిగోసపెడుతూ కార్పోరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టడానికి కొత్త కొత్త విధానాలకు నూతన విత్తన చట్టాన్ని తెచ్చి, విద్యుత్ సంస్కరణల పేరుతో సవరణ బిల్లును తెచ్చి రైతులను మోసం చేస్తుందని అన్న. అనేక లాభాలు గడిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ప్రైవేట్ పరం చేస్తూ ప్రజల పైన భారాలను మోపుతూ మనువాద ముసుగులో భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలనే కుట్రలు చేస్తుందని ఈ కుట్రలకు వ్యతిరేకంగా నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న “ జైలు భరో “ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమం జయప్రదం చేయడానికి ఈనెల 12న “ జిల్లా సదస్సు “ నిర్వహిస్తున్నామని ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పాల్గొంటున్నారని నర్సింహ తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, రైతు సంఘం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మూడు సంఘాల జిల్లా ఆఫీస్ బేరర్స్ దాసరి పాండు, బొల్లు యాదగిరి, బూరుగు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, సిరిపంగి స్వామి, మాయా కృష్ణ, యండి పాషా, తుర్కపల్లి సురెందర్, గొరిగి సోములు, చీరిక అలివేల తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల కల్పన, బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ మంగళవారం ఉప్పునుంతల, వంగూరు మండలాల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల భోజన ప్రమాణాలను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదుల నిర్వహణ, బోధనా విధానాలు, నిర్మాణ పనుల పురోగతిపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఉప్పునుంతల మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులకు టైలు, బెల్టుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా టైలు, బెల్టులను పంపిణీ చేసి వారితో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి, పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈఓ రమేష్ కుమార్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేశారు. బోధనలో మరింత నాణ్యత పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులను అవలంబించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలల హాజరు నమోదులను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పెరిగేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని, పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి విద్యలో వెనుకబడకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను కూడా డీఈఓ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి విద్యార్థుల వినియోగానికి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధ్యాయులు కూడా అదే స్థాయిలో బాధ్యతతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. డీఈఓ రమేష్ కుమార్ వెంట సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల గుట్టు రట్టు...!!

- అధిక ధరలు, బిల్లులు, రికార్డుల్లో లోపాలపై చర్యలు
- స్టాప్ సేల్‌తో పాటు షోకాజ్ నోటీసులు జారీ
- స్టాప్ సేల్ ఆదేశాలతో అప్రమత్తమైన వ్యాపారులు



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ పాల్, మండల వ్యవసాయ అధికారి శ్రీజ ఆధ్వర్యంలో సూరారం, రాపల్లికోట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, విక్రయ రికార్డులు, లైసెన్సులు, రైతులకు బిల్లుల జారీ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ క్రమంలో కొన్ని దుకాణాల్లో వ్యవసాయ శాఖ నిబంధనలను పాటించడం లేదని గుర్తించారు. సూరారం గ్రామంలోని సాయి ఫర్టిలైజర్స్ దుకాణంలో యూరియాను అధిక ధరలకు విక్రయించడం, స్టాక్ రిజిస్టర్లు మరియు బిల్ బుక్స్‌ను సక్రమంగా నిర్వహించకపోవడం, రైతులకు విక్రయాల సమయంలో బిల్లులు ఇవ్వకపోవడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. దీంతో ఆ దుకాణంలోని సుమారు రూ.2,39,000 విలువైన ఎరువుల నిల్వలకు స్టాప్ సేల్ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆ సరుకులను విక్రయించరాదని స్పష్టం చేశారు. అదేవిధంగా రాపల్లికోటలోని డీసీఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రంలో కూడా రికార్డుల నిర్వహణలో లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు సుమారు రూ.1,47,000 విలువైన ఎరువుల నిల్వలకు స్టాప్ సేల్ విధించారు. ఈ రెండు దుకాణాల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, జరిగిన ఉల్లంఘనలపై నిర్ణీత గడువులోపు వివరణ సమర్పించాలని ఆదేశించారు. అలాగే సూరారం గ్రామంలోని వినాయక ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేసిన అధికారులు, లైసెన్స్ రెన్యూవల్ గడువు ముగిసిన నేపథ్యంలో వెంటనే లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని, ప్రతి విక్రయానికి రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ పాల్ మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాల్సి ఉంటుందని, రైతులకు బిల్లులు ఇవ్వడం తప్పనిసరి అని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే ఎరువుల విక్రయ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే లైసెన్స్ రద్దు వరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయించడం లేదా బిల్లు ఇవ్వకపోవడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ పాల్, మండల వ్యవసాయ అధికారి శ్రీజ, వ్యవసాయ విస్తరణ అధికారులు రచన, ధర్మేందర్ పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా పలువురు రైతులు కూడా హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీల్లో ఘన విజయం

అభినందించిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి జూలై 7 క్రైమ్ మిర్రర్:** రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి గెలుపొందిన పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం అభినందించారు.విద్యార్థుల కృషి, క్రీడా స్ఫూర్తి జిల్లాకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.క్రీడలను ప్రోత్సహించడానికి మున్సిపాలిటీ తరపున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థులను,వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను, పాఠశాల యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు,రణధీర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కామన్ హాల్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**వనపర్తి జూలై 07 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు పట్టణంలోని శివాలయం వద్ద ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎస్డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన కామన్ హాల్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పనులకు టెంకాయ కొట్టి పనుల నాణ్యతపై మాట్లాడిన చైర్మన్, నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ కామన్ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఈ నిధులు మంజూరు చేయించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, రణధీర్ రెడ్డి, శివాలయం సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ పాలేరు :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను మల్టీ జోన్ వన్ పోలీస్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు కేసుల దర్యాప్తు తీరు, శాంతిభద్రతల నిర్వహణ ప్రజలకు అందుతున్న పోలీసు సేవలను ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని, సూచించారు అంతేకాకుండా ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజీ తో పాటు ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతి రెడ్డి,నేలకొండపల్లి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేర నియంత్రణ చర్యలపై ఐజీ కి వివరించారు. అనంతరం కూసుమంచి ఎస్ఐ నాగరాజు, తిరుమలాయపాలెం ఎస్సై జగదీష్ కారేపల్లి సిఐ సాగర్ , ముదిగొండ సీఐ మురళి సీఐ సంజు కూడా కార్యక్రమంలో పాల్గొని తమ పరిధిలో అమలు చేస్తున్న పోలీసింగ్ విధానాలపై వివరించారు.పోలీస్ స్టేషన్‌లోని మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది పనితీరును అభినందిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా సమర్థవంతంగా పనిచేయాలని డిపార్ట్మెంట్ అధికారులకు సూచించారు.

## 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ను జారీ చేయాలి.

బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు

**క్రైమ్ మిర్రర్ పాలేరు :** రాష్ట్రంలో 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని నేలకొండపల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం 7,347 వేల పోలీస్ ఉద్యోగాలకే నోటిఫికేషన్ జారీ చేసి చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో సుమారు 19 వేల పైగా పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆర్టిఐ ద్వారా బహిర్గతమవటమే కాక, తెలంగాణ రాష్ట్ర డీజిపి సీ. వి. ఆనంద్ తన నివేదిక లో వెల్లడించారు. కానీ కేవలం 7,347 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామనడం సరైంది కాదన్నారు. ఈ నోటిఫికేషన్ వల్ల 15 లక్షల మంది అభ్యర్థులు నైరాశ్యంలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత తీవ్ర అగ్రహంతో ఉన్నారని, ఇప్పటికైనా వారికి ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.





# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్) : రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన "జర్నలిస్టుల వినతులు"అనే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ చార్జీల్లో 1/3 వంతు రాయితీ కల్పించినప్పటికి ఆర్టీసీ సంస్థ మాత్రం దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల నిత్యం వార్తా సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు భారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సదుపాయం అమలు చేస్తుందని, అయితే ఇటీవల కాలంలో టోల్ ఫీజు, సర్వీస్ చార్జి పేరుతో మూడోవంతు చార్జీలను 50 శాతానికి పెంచారని తెలిపారు. పేరుకే 1/3 చార్జీలని, కానీ 50% చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఫలితంగా ఆర్టీసీ ప్రయాణ చార్జీల భారం విపరీతంగా పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ...కొద్ది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు పెద్ద ఆర్థిక భారమేమీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని వారు కోరారు.ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు అనగా ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# మియాపూర్‌లో దారుణం.. ప్రియుడితో కలిసి భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య

హైదరాబాద్ : మియాపూర్‌లో దారుణం వెలుగు చూసింది. ప్రియుడితో కలిసి భార్య భర్తను చంపి పూడ్చిపెట్టి భర్త కనిపించడం లేదని గతేడాది నవంబర్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేయగా కీలక విషయాలు వెలుగు చూశాయి. భార్యే తన భర్తను ప్రియుడితో కలిసి చంపి ఆ మృతదేహాన్ని పోలీసులు పూడ్చినట్లు గుర్తించారు. భార్య కాల్ రికార్డులు, సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డిగ్రీ చదవాలి అనుకుంటున్న విద్యార్థులకు రెడ్డి జాగృతి చేయూత

**రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి**



ఆత్మకూరు(ఎం),జూలై07/క్రైమ్ మిర్రర్: విద్యాదానం అనేది ఈ భూ ప్రపంచం మీద అన్నిటికంటే ఉత్తమమైన దానం.ఒక వ్యక్తి విద్యావంతుడుగా పరిపూర్ణుడైతే ఒక కుటుంబం మొత్తం తన పేదరికం దూరం పెట్టగలుగుతుంది.అటువంటి మహోన్నతమైనటువంటి ప్రతి ఒక్కరి జీవితంలో అవసరమైనటువంటి విద్యను కులం పేరు చెప్పి దూరం చేయటం అనేది బహుశా మన భారతదేశంలోనే జరుగుతున్నది. ప్రతిభావంతులకు సమాన అవకాశాలను అందించడం ద్వారా దేశ పునాదులు బలపడతాయన్న నిజాన్ని తెలుసుకోలేకపోతున్నటువంటి మన ప్రభుత్వాలు మన దేశానికి తీరని నష్టాన్ని తీసుకువస్తున్నాయి.ఆ కారణంగానే ప్రతిభావంతులకు కులం పేరుతో అవకాశాలను దూరం చేస్తున్న కారణంగా మేధో వలసలతో ఇతర దేశాలకు మన మేధావుల సేవలు ఉపయోగపడేలా చేస్తున్నటువంటి మన ప్రభుత్వ తీరు ఎప్పటికీ మారుతుందో మనకు తెలియదు.కానీ ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతూ ఉంది.ఆ నష్టాన్ని భర్తీ చేయడంలో భాగంగా రెడ్డి జాతి ఔన్నత్యం కోసం ఉన్నతి కోసం విద్యలో ప్రతిభ ఉండి అవకాశం లేక వెనకబడిపోతున్న కుటుంబాలకు చేయూత అందించాలని ఒక సంకల్పంతో 10 సంవత్సరాల రెడ్డి జాగృతి పోరాట ప్రస్థానంలో రెడ్ల హక్కుల కోసం నిరంతర పోరాటంతో పాటు మరొక ఆలోచన కూడా చేసింది.ఇప్పుడే మొదలైన ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లో 70 శాతం ఉత్తీర్ణత పొంది ఫీజులు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రెడ్డి కుటుంబాలకు చేయూత అందించడంలో భాగంగా మీ ముందుకు ఒక అద్భుత అవకాశాన్ని తీసుకువచ్చింది రెడ్డి జాగృతి.డిగ్రీకి సంబంధించిన మూడు సంవత్సరాల ఫీజులో అర్ధ భాగం విద్యార్థి కట్టుకున్నట్లయితే మిగిలిన అర్ధ భాగం రెడ్డి జాగృతి కట్టడానికి సిద్ధంగా ఉంది.ఈ మూడు సంవత్సరాలు ఫీజులో అర్ధ భాగం కట్టడంతో పాటు ప్లేస్మెంట్ కూడా ఆ విద్యా సంస్థ మీద నమ్మకంతో రెడ్డి జాగృతి బాధ్యతగా తీసుకుంటుంది.మన పిల్లలను విద్యతో పాటు ఉద్యోగానికి అవసరమైనటువంటి నైపుణ్యతను, సాంకేతికతను నేర్పి ఒక పరిపూర్ణ విద్యార్థిగా, సమర్థుడిగా తీర్చిదిద్దడంలో చేయి తిరిగిన ఒక అత్యున్నత విద్యాసంస్థలో చదివిద్దాం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో సగభాగం ఫీజు కట్టడానికి ఈ క్రింద డిగ్రీ కోర్సులు వివరాలు ఉన్నాయి. ఎంపీసీ విద్యార్థులతో పాటు బైపీసీ విద్యార్థులు కూడా అర్హులు:బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్),బీసీఏ(డాటా సైన్స్),ఎంపీసీ విద్యార్థులు అర్హులు:బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్),బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్ అండ్ డాటా సైన్స్), "ఇంటర్మీడియట్ ఏ గ్రూపు వారైనా చేసే కోర్సులు ఈ క్రింద పేర్కొన్నవి": బిబిఎ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), బిబిఎ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అనలేటిక్స్), బిబిఎ(బ్యాచిలర్ ఆఫ్ డిజిటల్ మార్కెటింగ్),బికామ్(కంప్యూటర్ అప్లికేషన్స్), బికామ్ (బిజినెస్ అనలేటిక్స్),రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# బచ్చన్ పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు, యూనిఫాంలు, షూస్ విక్రయం

**పాఠశాల బుక్స్ రూమ్ సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు**



క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని బచ్చన్ పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారనే సమాచారంతో వామపక్ష విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు నాయకులు మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అక్రమాలపై మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి లకు ఫిర్యాదు చేస్తామని నాయకులు చెప్పగా, నిర్లక్ష్య ధోరణితో పాఠశాల యాజమాన్యం సమాధానం ఇచ్చిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుని కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారులు పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్న గదిని పరిశీలించి సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను దోపిడీ చేసే విధంగా వ్యవహరించే ఏ ప్రైవేట్ పాఠశాలనైనా వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తూనే ఉంటాయని, ప్రజల ప్రయోజనాల కోసం ఎంతవరకైనా పోరాడతామని స్పష్టం చేశారు. అక్రమాలను బయటపెట్టిన విద్యార్థి నాయకులపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇది ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బచ్చన్ పాఠశాలలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కల్వకుర్తి పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు, షూస్ విక్రయిస్తున్న అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్, సంతోష్, పిడిఎస్యు కల్వకుర్తి అధ్యక్షుడు కార్తీక్, మోహన్, సాయి చరణ్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : మాదాపూర్ పరిధిలోని సిద్దికనగర్‌లో అంజయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. 1994లో ప్రారంభమైన దండోరా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా విస్తరించిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల కోసం నిరంతరం పోరాడి విజయం సాధించడంతో పాటు, ఇటీవల పద్మశ్రీ పురస్కారం అందుకున్న మందకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కుమ్మరి సత్యనారాయణ, జిల్లా నాయకులు ఐతా రమేష్, శేరిలింగంపల్లి మండల అధ్యక్షుడు గణేష్, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, సిద్దికనగర్ ప్రెసిడెంట్ నందు, బసవరాజ్, రాము, నరేష్, కోడిచర్ల ప్రేమ్ కుమార్, సరోజా మాదిగ, యాదమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోందంటూ ఎమ్మెల్యే సబితమ్మ మాట్లాడుతున్న మాటలు పూర్తిగా హాస్యాస్పదమని ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం ఒకవైపు ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, మరోవైపు మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండంచుల వ్యూహంతో ముందుకు సాగుతోంది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం అడుగులు వేస్తుంటుంటే చూసి ఓర్వలేక ఇలాంటి నిందలు వేయడం సిగ్గు చేటని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ప్రజల సౌకర్యార్థం శాంక్షన్ చేస్తున్న డ్రైనేజీ రోడ్లు, సిసి రోడ్ల నిర్మాణ పనులకు వచ్చి శంకుస్థాపనలు చేస్తోంది మీరే కదాఅని, కాంగ్రెస్ మంజూరు చేసిన నిధులతో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్న మిమ్మల్ని అసలు ఎవరు ఆపుతున్నారు, పదేళ్లపాటు అధికారంలో ఉండి నియోజకవర్గానికి మీరు చేసిందేమీ లేదు. కేవలం శిలాఫలకాలు వేయడానికే మీరు పరిమితమయ్యారు తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తీర్చింది లేదు. మీకు నిజంగా నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి చౌకబారు



మాటలు మాట్లాడరు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోంది. కళ్లముందే ఇంతలా అభివృద్ధి పనులు జరుగుతుంటే, దాన్ని చూసి ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేయడం సిగ్గుచేటు. ఇప్పటికైనా బురద చల్లే రాజకీయం మానుకొని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధి పనులకు సహకరించాలని, లేనిపక్షంలో మహేశ్వరం నియోజకవర్గ ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి హెచ్చరించారు.

# గర్భిణీ స్త్రీలు క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి

**చౌటుప్పల్,జులై 7,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. కాటం రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆషా డే కార్యక్రమానికి జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త, చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్. సూర్యశ్రీ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు డాక్టర్. సూర్యశ్రీ మాట్లాడుతూ... ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ తప్పకుండ ప్రభుత్వ ఆసుపత్రిలో పేరు నమోదు చేసుకొని ,క్రమం తప్పకుండ స్త్రీ వైద్య నిపుణులచే చూపించుకొని, వారు చెప్పిన సూచనలను పాటిస్తూ, గవర్నమెంట్ హాస్పిటల్ లో డెలివరీ కావాలని ప్రభుత్వ ఉచిత వైద్య సేవలను పొందాలని సూచించారు.దీనికి వైద్య సిబ్బంది,ఆశలు కూడా కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరిని గవర్నమెంట్ హాస్పిటల్ లో డెలివరీస్ ప్రోత్సహించినట్లయితే వారి కుటుంబానికి ఆర్థిక భారం తగ్గిచ్చినట్లవుందని, అనవసరమయినా ఆపరేషన్స్ కూడా తగ్గుతాయని తెలిపారు. ఇరవైనాలుగు గంటలు వైద్యులు అందుబాటులో వున్నారని, త్వరలోనే 100 పడకల



ఆసుపత్రిని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అనంతరం డాక్టర్. కాటం రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ ని గవర్నమెంట్ హాస్పిటల్ కి ఆశలు తోడుగా తీసుకురావాలని, ఏ ఒక్కరు కూడా ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం పెరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.పాండు రంగం, డాక్టర్.సుమన్ కళ్యాణ్, డాక్టర్. రజిని, ఎం ఎల్ హెచ్ పి లు, సూపెర్వైసోర్స్,ఏఎన్ఎం లు, ఆశలు పాల్గొన్నారు.

# జనని హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి

**వనపర్తి జులై 07 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మున్సిపాలిటీలో . కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటిగడ్డ శాఖాపూర్ గ్రామానికి చెందిన ఇమామ్సాబ్ సాబెరా బేగం(35)తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది పెబ్బేరు పట్టణంలోని జనని హాస్పిటల్లో ఐవీఎఫ్ ద్వారా ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయింది. చాలా జాగ్రత్తగా కాన్పు అయ్యే దాకా డాక్టర్ల సలహాలు



పాటించారు. హైరిస్క్ పేషంట్ కనుక అన్ని జాగ్రత్తలు పాటించాలని రెగ్యులర్ చెకప్ లు కూడా చేయించారు. జూన్ 28న సాబెరా బేగంకు బ్లీడింగ్ కావడంతో హాస్పిటల్లో చేర్పించారు. డా. ప్రియాంక రెడ్డి ఆమెకు సిజేరియన్ చేయగా.. కవల పాప, బాబు పిల్లలు జన్మించారు. వారికి శ్వాస సమస్య ఉండటంతో మహబూబ్నగర్లోని సుశృత హాస్పిటల్ లో ఐసీయూలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్యం నిలకడగానే ఉంది. అయితే పెబ్బేరులో చికిత్స తీసుకుంటున్న సాబెరా బేగంకు పొటాషియం తక్కువ కావడంతో ఇక్కడి డాక్టర్లు మహబూబ్నగర్కు రెఫర్ చేశారు. అక్కడి డాక్టర్లు నిమ్స్కు రెఫర్ చేయడంతో అక్కడ అడ్మిట్ కావాలంటే 24 గటంలు పడుతుందని.. మహబూబ్నగర్లోని నవోదయ హాస్పిటల్కు తీసెకెళ్లమని పెబ్బేరు డాక్టర్ జయచంద్రా రెడ్డి తెలపడంతో వారు అక్కడ అడ్మిట్ చేశారు. అక్కడ స్కానింగ్ చేయగా గర్భసంచి వద్ద వేసిన కుట్లు తొలగించకుండా కడుపునకు కుట్లు వేయడం.. లోపల మాయను తొలగించకుండా కుట్లు వేయడంతో ఈ సమస్య ఏర్పడినట్లు తెలిసింది. వెంటనే అక్కడి డాక్టర్లు లోపల మాయను తొలగించి క్లీన్ చేసి కుట్లు వేయడంతో రెండ్రోజులు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి సాబెరా బేగం చనిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంతా కలిసి పెబ్బేరులో హాస్పిటల్ వద్దకు డెడ్బాడీని తీసుకువచ్చి ఆందోళన చేశారు. పెద్ద మనుషులు పంచాయతీ పెట్టి హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించడంతో ఆందళన సద్దుమణిగింది. ఈ విషయమై జనని హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్లు ప్రియాంక, జయచంద్రా రెడ్డిలను వివరణ కోరగా.. ఆమెకు ఐవీఎఫ్ ద్వారా ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయింది. సిజేరియన్ సమయంలో ఆమెకు ట్విన్స్ జన్మించారు. కనుక ఇది హైరిస్క్ కేసుగా పరిగణించి మా వంతు ట్రీట్మెంట్ అందజేశాం. ట్విన్స్ ప్రెగ్నెన్సీ కాంప్లికేషన్స్ వల్ల ఆమెకు బ్లీడింగ్ సమస్య ఏర్పడి ప్రసవం అయ్యాక పొటాషియం తగ్గింది. ఆ ట్రీట్మెంట్ ఇక్కడ అందుబాటులో లేనందువల్ల మహబూబ్నగర్కు రెఫర్ చేశాం. అక్కడ వాళ్లు నిమ్స్కు రెఫర్ చేస్తే మానవతా దృక్పథంతో ఆలోచన చేసి అడ్మిట్కు ఇబ్బందులు తలెత్తుతాయని నవోదయకు మేమే రెఫర్ చేశాం.. అక్కడ రెండు రోజులు ట్రీట్మెంట్ తీసుకున్నారు. మంచిగానే ఉన్నారు. మూడో రోజు చనిపోయింది. ఇందులో మా తప్పు లేదని వారు తెలిపారు



## సింగరేణి విలువైన ఇనుప సామాగ్రిని పట్టుకున్న మందమర్రి సెక్యూరిటీ సిబ్బంది

**మందమర్రి టౌన్ జులై 7 క్రైమ్ మిర్రర్:** మందమర్రి సింగరేణికి సంబంధించిన రెండు టన్నుల విలువైన ఇనుప సామాగ్రిని మంగళవారం సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోవడం జరిగిందని ఏ ఎస్ ఓ వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యానగర్ లోని హనుమంత్ స్క్రాప్ దుకాణంలో సింగరేణి కి సంబంధించిన ఇనుప సామాను ఉన్నదని ఇంటెలిజెన్సీ కె శ్రీనివాసరావు కి నమ్మదగిన సమాచారం మేరకు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి జూనియర్ ఇన్స్పెక్టర్ బోయిని ఓదేలు, ఐడి పార్టీ దాసరి మల్లేష్ సిబ్బందిని దుకాణంపై రైడింగ్ చేయమని ఆదేశాలు జారీ చేశారు. సెక్యూరిటీ సిబ్బంది వెళ్లి పట్టుకోగా టీఎస్ ఓయు డి 4242 నంబర్ గల వ్యానులో లోడు చేసుకొని తీసుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న వ్యానును సామానుతో సహా పట్టుకున్నామని తెలిపారు. దీనిలో సింగరేణి సంబంధించి ఇనుప సామాను 2,180 కేజీల సామాను ఉన్నదని దాని విలువ 43600 ఉంటుందని చెప్పారు. ఇనుప సామాన్లతో ఉన్న వ్యానును ఎస్ అండ్ పి సి ఆఫీస్ కు తరలించి పోలీస్ స్టేషన్ కి అప్పగించామని తెలియజేశారు

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

**ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం: మస్నూరి రాజేష్ మాదిగ..**

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఖాజాగూడాలో మస్నూరి రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండాను ఆవిష్కరించి, ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు, ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా నిరంతరం పోరాటం చేస్తోందని రాజేష్ మాదిగ తెలిపారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి కార్యకర్త ఉద్యమ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని, ఉద్యమ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేష్, కన్వీనర్లు ప్రేమ్, నరేష్, రాజు, శ్రీనివాస్, పింటూ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

